AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

చెరువుల్లోకి చేప పిల్లలు



2



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

2

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండు నెలల పాటు ఆమె ప్రసూతి సెలవులో ఉన్నారు. అయితే కలెక్టర్ ఇలాత్రిపాఠి ప్రసూతి సెలవుల్లో ఉండగా ఆమె భర్త నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా నిజామాబాద్‌కు ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా వ్యవహరించారు. రెండు నెలల పాటు జిల్లా పాలనలో బిజీగా ఉన్నారు. తాజాగా గురువారం సెలవులు ముగిసిన అనంతరం ఇలా త్రిపాఠి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కూతురు జన్మించిన విషయం తెలిసిందే.

పట్టుకోండి చూద్దాం..



- కామారెడ్డిలో దోపిడీ దొంగల హల్‌చల్
- పసిడి కోసం హత్యలకు తెగబడుతున్న దొంగలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న వైనం
- గల్లీల్లో కరువవుతున్న పోలీస్ పెట్రోలింగ్..?

కామారెడ్డిలో దొంగలు రెచ్చిపోతున్నారు. బంగారు ఆభరణాలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులకు పసిడి అందని ద్రాక్షగా మారింది. దీన్నే అదునుగా చేసుకున్న దొంగలు నగదు కంటే బంగారం నగలపైనే కన్నేశారు. ఎక్కడ బంగారం కనిపిస్తే అక్కడ దాడులకు సైతం తెగబడుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

ఒకప్పుడు ఇళ్లలో నగదు, టీవీలు, ఇతర విలువైన వస్తువులను చోరీ చేసే దొంగలు ఇప్పుడు రూట్ మార్చారు. బుధవారం కామారెడ్డి పట్టణంలో జరిగిన రెండు ఘటనలు ఈ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రాత్రి సమయంలో, అందులోనూ జిల్లా కేంద్రం నడిబొడ్డునే ఇలాంటి దారుణాలు జరగడం పోలీసు వ్యవస్థను సవాల్ చేసినట్లయింది.

వరుస ఘటనలతో బెంబేలు

కామారెడ్డి పరిధిలో ఇటీవల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. జయశంకర్ కాలనీలో ఓ ఇంట్లో నుంచి ఏకంగా బీరువానే ఎత్తుకెళ్లడం కలకలం రేపింది. అలాగే విద్యానగర్ కాలనీలో ఇంట్లో భోజనం చేస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. లింగాపూర్ శివారులో అర్ధరాత్రి ఇంట్లో పడుకున్న మహిళ ఇంట్లో తలుపులు, గొళ్లెం పెట్టి ఉన్నా బంగారం మాయం కావడం కలకలం రేపింది. ఒకేరోజు గంటల వ్యవధిలో ఓ హత్య, ఓ మహిళపై దాడి ఘటనలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గల్లీలలో గస్తీ పెంచడంతో పాటు సీసీ కెమెరాలను పటిష్టం చేయాలని, ప్రతి రోజు తప్పనిసరిగా పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంటల వ్యవధిలో హత్య.. దాడి

బుధవారం ఒక్కరోజే గంటల వ్యవధిలో రెండు ఘటనలు జరగడం కలకలం రేపుతోంది. పాత బస్టాండ్ సమీపంలోని కోటారి గల్లీలో ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి బంగారు నగలు ఎత్తుకెళ్లి హత్య చేసి పారిపోయారు. అదే రోజు అర్ధరాత్రి కల్కినగర్ కాలనీలో ఇంట్లో హాల్లో పడుకున్న మహిళ మెడలో 5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించడంతో కళ్లలో కారంచల్లి గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ రెండు ఘటనలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి.

నిఘా కరువు

జిల్లా కేంద్రంలో నేరాలు పెరుగుతున్నా గల్లీల్లో పోలీస్ పెట్రోలింగ్ కరువైందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో తప్ప కాలనీల్లో, గల్లీల్లో రాత్రి వేళల్లో పోలీసుల జాడే కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో రాత్రిపూట నిరంతరం తిరిగే పెట్రోలింగ్ వాహనాలు ఇప్పుడు కనిపించడం లేదని, దీంతో దొంగలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 100, 112 నంబర్లకు ఫోన్ చేస్తే తప్ప పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి.

ఆకతాయిల అడ్డాగా

పట్టణంలోని కోటారి గల్లీ ఆకతాయిలకు అడ్డాగా మారిందన్న ప్రచారం సాగుతోంది. ఈ గల్లీలో సెకండ్ హ్యాండ్ ఫోన్ల వ్యాపారం జోరుగా సాగుతోందని, అలాగే వ్యభిచారం కూడా జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. నిత్యం ఈ దారి నుంచి మార్కెట్ వైపు వందలాది మంది వెళ్తుంటారు. మద్యం సేవించి వచ్చిపోయే వారిని ఆకతాయిలు అటకాయిస్తారన్న ప్రచారం ఉంది. ఈ గల్లీలో సీసీ కెమెరాలు లేవని, పోలీసుల పెట్రోలింగ్ కూడా ఉండదన్న ప్రచారం ఉంది.

బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



అక్షరటుడే, భీమ్‌గల్: బడాభీమ్‌గల్ గ్రామ బీజేపీ నూతన అధ్యక్షుడిగా చిరునంచ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కొట్టాల మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గ్రామ బూత్ కార్యకర్తలు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ పాల్గొని నూతనంగా ఎన్నికైన రాజ్‌కుమార్, మోహన్‌లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సందు గంగాధర్, లంక గంగ మోహన్, కొట్టాల అశోక్, కట్టే లింగం, ఓరగంటి కిషన్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరటుడే, కామారెడ్డి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. గురువారం మాచారెడ్డి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, తూకం, నాణ్యత పరిశీలన, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ నాసిలాల్, సర్పంచ్ సంతోష్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గణేష్ నాయక్, సొసైటీ డైరెక్టర్లు, సర్పంచులు తదితరులున్నారు.

ఆర్టీవో అధికారుల తనిఖీలపై సర్వత్రా విమర్శలు

అక్షరటుడే, కామారెడ్డి: వాహనదారులు రూల్స్ పాటించేలా చేయడమే మా బాధ్యత.. మేము రూల్స్ పాటించాల్సిన అవసరం లేదన్నట్టుంది ఆర్టీవో అధికారుల తీరు. కామారెడ్డి జిల్లా లో అధికారుల తనిఖీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై నంబర్ ప్లేట్ లేని వాహనాలు, ఇతరత్రా ధృవపత్రాలు లేని వాహనాలను తనిఖీ చేయడం వరకు బాగానే ఉన్నప్పటికీ, అధికారులే నంబర్ ప్లేట్ లేని వాహనంలో వెళ్లి తనిఖీలు చేపడుతున్నారు. గురువారం తాడ్వాయి, భిక్కనూరు మండలాల పరిధిలో అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో నిబంధనలు పాటించని రెండు వాహనాలను పట్టుకుని సీజ్ చేసి వారికి జరిమానాలు విధించారు. అయితే రూల్స్ ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వ నిబంధనలు చెప్పే అధికారులు మాత్రం నంబర్ ప్లేట్ లేని వాహనంలో వెళ్లి తనిఖీలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. రవాణా శాఖలో పనిచేసే అధికారులే రూల్స్ పాటించకపోతే సామాన్యులు ఎలా పాటిస్తారని ప్రజలు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జిల్లా రవాణాశాఖ అధికారి సంతోష్ ను వివరణ కోరగా,



ప్రభుత్వ ఆదేశాల మేరకు తమకు టార్గెట్స్ ఉన్నాయని, వాటి ప్రకారం తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. తాడ్వాయి మండలంలో నంబర్ ప్లేట్ లేని వాహనంలో అధికారులు వెళ్లి తనిఖీలు చేపట్టిన మాట వాస్తవమేనని అంగీకరించిన ఆయన, వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఎస్ఐఆర్ నోటీసులకు ఆన్‌లైన్ ద్వారా ధృవీకరణ ఇవ్వొచ్చు

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు బీఎల్‌వోలను ప్రత్యక్షంగా కలవక్కర్లేదని.. ఆన్‌లైన్ ద్వారా కూడా తమ ధృవపత్రాలు అందించవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డితో వీసీలో మాట్లాడారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. జిల్లాలో ఇంకా 6,106 మందికి నోటీసులు అందించాల్సి ఉందన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో 3,865 నోటీసులు పెండింగ్ లో ఉన్నాయని, ఆర్మూర్‌లో 1631, బోధన్‌లో 16, బాన్సువాడ సెగ్మెంట్‌లో 437, బాల్కొండ నియోజకవర్గంలో 157 నోటీసులు ఇంకా ఇవ్వాల్సి ఉందన్నారు. వీరిలో అత్యధిక మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, ఓటరు జాబితాలో పొందుపర్చిన చిరునామాలలో లేకపోవడమే కారణమన్నారు. బీఎల్‌వోలను క్షేత్రస్థాయిలో వారి ఇళ్లకు పదేపదే పంపిస్తూ నోటీసులు అందించే ప్రయత్నం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం తెలియజేస్తున్నామని తెలిపారు. ఈఆర్‌వో, ఏఈఆర్‌వోల కార్యాలయాల నోటీసు బోర్డుల్లో కూడా సమాచారాన్ని ప్రదర్శించే






లా చర్యలు తీసుకున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంత కష్టమొచ్చే..

ఉన్నది ఒకటే బస్సు.. ఆ బస్సు వెళ్లిపోతే మరో బస్సు రాదు.. దీంతో విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. గాంధారి మండలంలోని చద్మల్ నుండి మండల కేంద్రంలో చదువుకునేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వెళ్తుంటారు. అయితే నిజామాబాద్ నుండి చద్మల్ మీదుగా గాంధారికి ఉదయం పూట ఒకే బస్సు ఉండడంతో తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్ బోర్డ్‌పై ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. విద్యార్థుల కోసమైన ప్రత్యేక బస్సు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– అక్షరటుడే, గాంధారి





పేదల సొంతింటి కల సాకారం: షబ్బీర్ అలీ

అక్షరటుడే, కామారెడ్డి: ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం ఒక ఇల్లు కాదని, ప్రతి పేద కుటుంబాల ఆత్మగౌరవానికి ప్రతీక అని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి, వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, కౌన్సిలర్లు సావిత్రి, అఖిల, స్వప్న, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, యూనుస్, షేరు,గంగాధర్ పాల్గొన్నారు.

హమారా ప్రసాద్ రాసిన పుస్తకాన్ని బీజేపీకి ఆపాదించడం శోచనీయం

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: హమారా ప్రసాద్ రాసిన పుస్తకాన్ని బీజేపీకి ఆపాదించడం శోచనీయమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బీఆర్ శివప్రసాద్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోతుల పురుషోత్తం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అంబేడ్కర్‌ను ప్రపంచ మేధావిగా గౌరవిస్తుందన్నారు. బీజేపీ ఏనాడూ బాబాసాహెబ్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేయదన్నారు. వివాదాస్పద పుస్తకం రాసిన ఆ వ్యక్తిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు వ్యక్తులు తెరవెనుక ఉండి బీజేపీని బద్నాం చేయడానికే ఇలాంటి వివాదాలు సృష్టిస్తున్నారు. దళిత సమాజాన్ని బీజేపీకి దూరం చేయాలని, హిందూ సమాజంలో చీలికలు తీసుకురావాలని వారు పన్నుతున్న కుట్రలను బీజేపీ ఎప్పటికీ సాగనివ్వదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లే.. ఈరోజు ఒక సామాన్య చాయ్‌వాలా, ఓ బీసీబిడ్డ అయిన నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రి కాగలిగారన్నారు. ప్రధాన కార్యదర్శులు గుంజలి నాగభూషణ్, పులి యుగంధర్, ఉపాధ్యక్షులు ఎడ్ల బాలకృష్ణ, మురళీకృష్ణ, దయా ప్రవీణ్, జిల్లా కోశాధికారి పవర్ సాయినాథ్, కార్యదర్శులు రాహుల్, అఖిలేష్, బుడ్డా సృజన్, శ్రీనివాస్, శంకర్, కార్యవర్గ సభ్యులు సతీష్, శ్రీనివాస్, మహేందర్, అవినాష్ పాల్గొన్నారు.



ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై చర్యలు తీసుకోండి



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో అనుమతులు లేకుండా వసతి గృహాలు నిర్వహిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ ఏడీకి వినతి పత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా హాస్టళ్లను నడుపుతూ రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయని, పుస్తకాలు, యూనిఫాంలను పాఠశాలల్లోనే అమ్ముతూ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. ఫీజుల వివరాలు, ఆడిట్ లెక్కలు, ఉపాధ్యాయుల అర్హతలను నోటీసు బోర్డులో ప్రదర్శించడం లేదని, విద్యాశాఖ షోకాజ్ నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. విద్యార్థులను దోచుకుంటున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ జీవియం వితల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ కుమార్, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్, పెరుమాండ్ల బులెట్ పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో మొక్కల పంపిణీ

అక్షరటుడే,భీమ్‌గల్: పట్టణంలో గురువారం వనమహోత్సవం సందర్భంగా 1 నుంచి 6 వార్డులలో ఇంటింటికీ పండ్ల, పూల మొక్కలను పంపిణీ చేశారు. స్థానిక కౌన్సిలర్ల అధ్వర్యంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి ముఖ్య అతిథిగా హాజరై మొక్కల పంపిణీని ప్రారంభించారు. కౌన్సిలర్లు ఆరేపల్లి శ్రీజ, కుశలత, తోట సతీష్, గున్నాల బాలలక్ష్మి, బొదిరే లావణ్య ఆధ్వర్యంలో వార్డుల్లో ప్రజలకు మొక్కలు అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో చేపపిల్లల కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారులకు మత్స్యశాఖ శుభవార్త చెప్పింది. చేపపిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో వారంరోజుల్లో చేపపిల్లలను చెరువులు, కుంటల్లోకి చేర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్లను ఖరారు చేసిన అధికారులు.. జలవనరులను గుర్తించే ప్రక్రియను కూడా చేపట్టారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి



చెరువుల్లోకి చేప పిల్లలు..

■ టెండర్ ప్రక్రియ పూర్తి.. వారంరోజుల్లో చెరువుల్లోకి..
■ విడుదలకు మత్స్యశాఖ సన్నాహాలు ■ ఉమ్మడి జిల్లాలో 6కోట్ల చేప పిల్లల విడుదల లక్ష్యం

సాధారణంగా ప్రతిఏటా జూన్, జూలైలో చేపపిల్లల పెంపక ప్రక్రియ పూర్తిచేసి ఆగస్టు, సెప్టెంబర్‌లో జలవనరుల్లో వదులుతారు. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో చేప పిల్లల విడుదల ప్రక్రియ కూడా వాయిదా పడింది. తాజాగా కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండడంతో ప్రభుత్వం చేప పిల్లల విడుదలకు అనుమతి ఇవ్వడంతో ప్రక్రియ వేగం పుంజుకుంది.

నలుగురు కాంట్రాక్టర్లకు టెండర్లు

కామారెడ్డి జిల్లాలో ఈ ఏడాది 2.86 కోట్ల చేప పిల్లలను వివిధ జలవనరుల్లో విడుదల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. చేప పిల్లల సరఫరాకు సంబంధించి నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. ఈ వారంలోనే చేప పిల్లలను చెరువుల్లోకి విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి లాయక్ తెలిపారు. గతంలో 2.87 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉండగా కేవలం 1.24 కోట్ల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేశారు. ఈసారి లక్ష్యం మేరకు విడుదల చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జిల్లాలో 765 జలవనరులు

కామారెడ్డి జిల్లాలో మొత్తం 765 జలవనరులు, 249 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీటిలో పురుషుల సంఘాలు 195 ఉండగా 11,472 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాలు 45 ఉండగా 1,291 మంది సభ్యులు, ఇతర సంఘాలు 9 ఉండగా 992 మంది సభ్యులు ఉన్నారు. మొత్తంగా జిల్లాలో 13,755 మంది మత్స్యకారులు ఉన్నారు. నిజాంసాగర్‌లో 24 సంఘాలకు 1,002 మంది, లింగంపేటలో 23 సంఘాలకు 851 మంది, మాచారెడ్డిలో 19 సంఘాలకు 1,159 మంది సభ్యులు ఉన్నారు. బీబీపేటలో 1,092 మంది మత్స్యకారులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో 6 కోట్ల లక్ష్యం

నిజామాబాద్ జిల్లాలో 796 జలవనరులు, 38 మత్స్యకార సంఘాలు ఉండగా 24,178 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1,561 జలవనరులు ఉండగా, ఈ ఏడాది సుమారు 6 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పరిమాణాన్ని బట్టి ధర

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 80 నుంచి 100 మిల్లీమీటర్ల పరిమాణం కలిగిన చేప పిల్లకు రూ.1.65, 35 నుంచి 40 మిల్లీమీటర్ల పరిమాణం కలిగిన చేప పిల్లకు 68 పైసలు చొప్పున ధర నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. చేప పిల్లల విడుదలతో జలవనరుల్లో చేపల ఉత్పత్తి పెరగడంతో పాటు మత్స్యకార కుటుంబాలకు ఉపాధి, ఆదాయం మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ




అక్షరటుడే, మాక్లూర్: మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ పనుల విషయంలో తాను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమంగా తరలించే ఇసుక, మొరం తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేఖర్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన 27వ వార్డు కౌన్సిలర్ రియాజ్

అక్షరటుడే, ఆర్మూర్ : పట్టణంలోని 27వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ రియాజ్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి రియాజ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గోసె దామోదర్, సునీల్ రెడ్డి, సడక్ ప్రమోద్, చిన్నాపూర్ సర్పంచ్ చిన్న, మాజీ కౌన్సిలర్ ఆకుల రాము పాల్గొన్నారు.







ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

ఉమ్మడిజిల్లావ్యాప్తంగా గురువారం పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. సొసైటీలు, ఐకేపీ సిబ్బంది కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అధికారులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్











రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మేయర్ ఉమారాణి పేర్కొన్నారు. నగరంలో మెప్మా ఆధ్వర్యంలో శ్రద్ధానంద్ గంజ్, జీజీ కళాశాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాలను ప్రారంభించిన అనంతరం మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు తమ ఉత్పత్తిని సులభంగా అమ్ముకునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని ఆమె అన్నారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. మెప్మా ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా సకాలంలో చెల్లింపులు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది రైతులకు కేంద్రాల వద్ద పాటించాల్సిన విధివిధానాలు, అవసరమైన పత్రాలు కొనుగోలు ప్రక్రియ గురించి వివరించారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు గాంధారి విద్యార్థి



అక్షరటుడే, భిక్కనూరు: మండలంలోని గండివేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 10వ తరగతి విద్యార్థి కంది ప్రవీణ్ నెట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. భిక్కనూరు మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌ను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయ భారతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెలలో మేడ్చల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రవీణ్ పాల్గొననున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు తాండూర్ విద్యార్థి



అక్షరటుడే, ఎల్లారెడ్డి: జిల్లాస్థాయి బాక్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచిన జడ్పీహెచ్ఎస్ తాండూర్ పాఠశాల విద్యార్థి అఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలకు చెందిన అఖిల్ 55 కేజీల బాక్సింగ్ విభాగంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.స్వప్న, ఎంఈవో వెంకట్‌రెడ్డి విద్యార్థి అఖిల్‌ను అభినందించారు. క్రీడల్లో పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తూ జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల సాధికారత, చట్టాలపై అవగాహన

అక్షరటుడే, ఆర్మూర్ : ఆర్మూర్ గురుకుల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థుల సాధికారత, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐడీఏఎస్ ఫార్మర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ పీఎస్ఎన్ మూర్తి, రిటైర్డ్ ఎస్బీఐ లైఫ్ రీజినల్ మేనేజర్ సురేష్ చంద్రారెడ్డి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. కేరీర్ గైడెన్స్ గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చంద్రిక, వైస్ ప్రిన్సిపల్ చైతన్య శాంతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు ఘన సన్మానం

అక్షరటుడే, ఎల్లారెడ్డి : పట్టణంలోని 1, 6, 9, 10, 12వ వార్డులకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు అగల్ దివిటీ రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవా రంగంలో పనిచేస్తున్న మహిళా కార్యకర్తల సేవలను గుర్తించి శాలువాలతో సత్కరించారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు విద్యాబోధనతో పాటు వారి ఆరోగ్యం, ఎదుగుదల, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశవర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మధ్రి బాలకిషన్ మాట్లాడుతూ చిన్నారుల విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో అంగన్‌వాడీ టీచర్ల సేవలు ఎంతో కీలకమన్నారు.

